క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిగ్రీ అధ్యాపకులు సంఘం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అధ్యక్షులు దయకర్, కట్కకం మురళి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ.. దోస్త్ ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక దశలో ఆగస్టు 1 నుంచి 11 వరకు దరఖాస్తులు స్వీకరించనున్న ట్లు తెలిపారు. బీఏ, బీకాం(కంప్యూటర్), బీఎ స్సీ (ఫిజికల్‌సైన్స్), బీఎస్సీ (లైఫ్‌సైన్స్)లో ఒక్కక్క గ్రూపుల్లో 60 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు.

చేయి చేయి కలిపారు.. రోడ్డు బాగుచేశారు



రోడ్డును బాగు చేసుకుంటున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని బావుజిపేట్ గ్రామస్తులంతా ఏకమై రోడ్డును బాగు చేసుకున్నారు. సిరిచెల్మ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని మారుమూల గిరిజన గ్రామమైన బావుజిపెట్‌కు మట్టిరోడ్డు మాత్రమే ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. కాలినడకన నడవడం కూడా కష్టంగా మారడంతో గ్రామస్తులంతా ఏకమై రోడ్డును బాగు చేసుకున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారిన గిరి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడం లేదని ఆరోపించారు. వర్షాకాలంలో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బతుకుతున్నామన్నారు. ఇప్పటికైనా గిరిగ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మహేందర్, అసెంబ్లీ ఇన్‌చార్జి మెస్రం జంగుబాపులు డిమాండ్ చేశారు. దీక్షలు చేపటిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులకు మద్దతు తెలిపారు. డివిజన్‌గా ఏర్పాటు చేస్తే అన్నివిధాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. 25 రోజులుగా దీక్షలు చేపడుతున్న పంచాయతీ కార్మికులకు మద్దతు తెలిపారు. వారి డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోథ్ అసెంబ్లీ ప్రెసిడెంట్ పంచాక్షరి, ప్రధాన కార్యదర్శి పాముల హరినాథ్, పాముల అనిల్, రాహుల్, ప్రవీణ్, క్రాంతి, విజయ్, హరీష్, లక్ష్మణ్, గంగయ్య, సాగర్ పాల్గొన్నారు.

పథకాలు, హక్కులపై అవగాహన కల్పించాలి

ఎదులాపురం: మహిళలకు హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద సీడీపీవో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలకు సూచించారు. సోమవారం స్థానిక ఫిల్టర్‌బెడ్‌లోని ఐసీడీఎస్ జైనథ్ ప్రాజెక్టు కేంద్రంలో సోమవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు, చట్టాలు, మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో నర్సమ్మ, సూపర్‌వైజర్లు, డీహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది కృష్ణవేణి, కోటేశ్, నిఖిలేశ్వర్, సఖీ సిబ్బంది సుకేష్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు

నేరడిగొండ: జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకుంటానని కుంటాల జలపాతానికి వెళ్తున్న మహిళను పోలీసులు కాపాడారు. ఏఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన కొయ్యాడి స్వప్న మానసిక ఒత్తిడితో ఆత్మహత్య చేసుకుంటానని సోమవారం కుంటాల జలపాతానికి బయల్దేరింది. గ్రామస్తుల సహకారంతో ఆమెను పట్‌పట్‌తండా సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మహిళకు పోలీసులు కౌన్సిలింగ్ చేశారు.

మండలంగా ప్రకటించాలని సీఎంకు లేఖ



సీఎంకు రాసిన లేఖను చూపుతున్న ఎమ్మెల్యే

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని సీఎం కేసీఆర్‌కు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు లేఖ రాశారు. సోమవారం బరంపూర్ మండలసాధన సమితి నాయకులకు లేఖను చూపించారు. భరంపూర్ మండల ఏర్పాటుకు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో బాబన్న, దివ్య మాధవ్, ఎల్టీ గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, రాజేశ్వర్, మలుకు, విట్టల్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం అందని ద్రాక్షేనా?

- భీంపూర్ మండలం మొత్తానికి ఒకే వైద్యాధికారి
- సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్న జీవాలు



కరంజి(టి)లో పశువైద్యశాల

తాంసి: వర్షాకాలం వచ్చిందంటే గ్రామాల్లో జీవాలు వ్యాధుల బారిన పడుతాయి. త్వరితగతిన వైద్యం అందిస్తే కొలుకోనే అవకాశం ఉంటుంది. కానీ సరైన సమయంలో వైద్యం అందకపోవడంతో భీంపూర్ మండలంలో పలు గ్రామాల్లో జీవాలు మృత్యువాత పడుతున్నాయి. మండలం మొత్తానికి ఒకే వైద్యశాల ఉండడంతో పాటు ఒకరే పశువైద్యాధికారి ఉండడంతో రోగాల బారిన పడిన పశువులకు సకాలంలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. మేకలు, గొర్రెలు, పశువులను కాపాడుకునేందుకు సకాలంలో వైద్యం అందక పెంపకందారులు అనేక పాట్లు పడుతున్నారు. భీంపూర్ మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలు ఉండగా.. మొత్తం 38 గ్రామాలున్నాయి. వీటన్నింటికీ కలిపి మండలానికి ఒకే పశువైద్యాధికారి, వారి కింద పని చేసేందుకు అసిస్టెంట్ వెటర్నరీ ఉన్నాడు. అర్లి(టి)లో పశువైద్య ఆరోగ్య ఉపకేంద్రం ఉన్నప్పటికీ సరైన వైద్యం అందడం లేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరంజి(టి)లో పశువైద్య ఆరోగ్య కేంద్రం..

భీంపూర్ మండల కేంద్రంలో అందరికీ అందుబాటులో ఉండాల్సిన మండల పశువైద్య కేంద్రాన్ని కరంజి(టి) గ్రామంలో ఏర్పాటు చేశారు. గ్రామం మహారాష్ట్రకు సరిహద్దుగా ఉండడంతో ఇతర గ్రామాలకు దూరంగా ఉంటుంది. పశు వైద్యశాలకు వెళ్లాలంటే రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. మండలంలో అధికంగా 18వేల వరకు గొర్రెలు, 12వేలు మేకలు, 16 వేల పశువులు ఉన్నాయి. కరంజి(టి)లో వైద్యాధికారి అందుబాటులో ఉన్నాడో? లేడో? తెలియని పరిస్థితి నెలకొంది.

గోపాలమిత్ర సేవలే దిక్కు

మండలంలోని ఆయా గ్రామాల్లో ఎక్కడైనా పశువులు రోగాల బారిన పడితే ఆయా గ్రామాల పరిధిలో ఉన్న గోపాలమిత్ర అందించే వైద్యమే పశువులకు దిక్కు. మండలంలో మొత్తం ఎనిమిది గోపాలమిత్ర సెంటర్‌లు ఉండగా.. పశువైద్య సిబ్బంది సైతం అందుబాటులో లేక గోపాలమిత్రలను ఆశ్రయిస్తున్నారు. పిప్పల్‌కోటి, భీంపూర్, వడూర్, అంతర్గాం, అందర్‌బంద్, గుబిడి, తాంసి(కె), మార్కగూడ గ్రామాల్లో గోపాలమిత్రలు అందుబాటులో ఉంటారు. తమ గ్రామాల పరిధిలో ఉన్న పశువులకు సకాలంలో వైద్యం అందించడం ద్వారా కొంత మేర జీవాలకు మేలు జరుగుతుంది. ఇప్పటికైనా అందరికి అందుబాటులో ఉండే విధంగా మండల పశువైద్య కేంద్రాన్ని మండల కేంద్రంలో అందుబాటులో ఉంచాలని పశుపోషకులు కోరుతున్నారు.

సకాలంలో వైద్యం అందిస్తున్నాం

మండల కేంద్రంలో పశువైద్య కేంద్రం ఉంటే అన్ని గ్రామాల రైతులకు అందుబాటులో ఉంటుంది. కానీ కరంజి(టి)లో పశువైద్య కేంద్రం ఉండటంతో రైతులకు, పశువుల పెంపకందారులకు సైతం అక్కడికి రావడం ఇబ్బందిగా ఉంది. పశువులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం.

– సుభాష్ రాథోడ్, పశువైద్యాధికారి

‘కళ్లకలకపై జాగ్రతగా ఉండాలి’



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇచ్చోడ: వాతావరణం మార్పులతో కళ్ల కలక వ్యాప్తి చెందుతుందని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కళ్ల కలక ఒక్కరి నుంచి ఒక్కరికి సోకే ప్రమాదం ఉందన్నారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ రాజ్‌కిరణ్, ఏఎన్‌ఎం కాంతమ్మ ఉన్నారు.

నార్నూర్: వర్షకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఏటీడీవో క్రాంతికుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలిక ఆశ్రమ పాఠశాలతో పాటు మాన్కాపూర్, జామ్డా పాఠశాలను తనిఖీ చేశారు. కళ్లకలక వ్యాధిపై ఆరా తీశారు. ఆశ్రమ పాఠశాలో శానిటేషన్, క్లోరినేషన్‌పై దృష్టి సారించాలన్నారు. నార్నూర్‌లో 50 మందికి విద్యార్థులకు కళ్లకలక వ్యాధి వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్ ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి హరీష్ అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీపూర్, లాల్‌ఘడ, సోనాపూర్, గ్రామాలలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జలుబు, డెంగ్యు, మలేరియా, డైయేరియా వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అన్నమొల్ల కిరణ్

ఎదులాపురం: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం సీఐటీయూ రాష్ట్ర ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా స్కీములలో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ వంటి వాటికి దూరంగా వెట్టి చాకిరీ చేస్తున్నారన్నారు. ఐకేపీ వీవోఏలు, గ్రామ పంచాయతీ, కార్మికులు సమ్మెబాట పట్టారని, ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమస్యలపై చర్చించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

నేరడిగొండ: గ్రామ పంచాయతీలోని పారిశుద్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షుడు రాచకొండ పోశెట్టి అన్నారు. మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 25వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా పారిశుద్య కార్మికులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద వంటవార్పు నిర్వహించేందుకు తరలివెళ్లారు. సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కుంచం భోజన్న, రామంచ రాజేశ్వర్, గజ్జల అశోక్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా టీజీవీపీ ఆవిర్భావ దినోత్సవం

ఎదులాపురం: తెలంగాణ విద్యార్థి పరిషత్ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద పరిషత్ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. టీజీవీపీ ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. కుల, మత, రాజకీయాలతో సంబంధం లేకుండా విద్యార్థుల సంక్షేమ ధ్యేయంగా పని చేస్తుందన్నారు. అనంతరం రిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బోథ్ నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్ యాదవ్, ఉల్లెంగుల సతీశ్‌కుమార్, అవునూరు శ్రీనివాస్, సంతోశ్ పాల్గొన్నారు.

సమాచారం

సంస్మరణ సభ

ఉట్నూర్‌రూరల్: భరత్ కమ్యూనిస్టు విప్లవోద్యమ నిర్మాతలు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డిల సంస్మరణ సభను గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎన్‌ఆర్‌నగర్ కాలనీలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. గ్రామీణ పేదలసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్, దేవరావు, నాందేవు, సురేశ్, శ్రీనివాస్, రవి, శ్రీహరి, చంటి, వెంకటేశ్ పాల్గొన్నారు.

పాఠశాల ప్రారంభం

సిరికొండ: మండలంలోని కోసుపటేల్ గూడలో ఐటీడీఏ తరుపున ప్రాజెక్టు అధికారి ఆత్రం భాస్కర్‌తో కలిసి సర్పంచ్ జాదవ్ అనిత సోమవారం పాఠశాలను ప్రారంభించారు. కోసుపటేల్ గూడ ప్రజల కోరిక మేరకు గ్రామంలోని 25 మంది విద్యార్థుల కోసం సీఆర్టీని నియమించి ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిచడం జరిగిందన్నారు. గ్రామ పటేల్ కుంరం రావుజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో విద్యుత్ వైర్లు తగిలి ఎద్దు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. కుచులాపూర్ శివారులోని కారెం లక్ష్మణ్‌కు చెందిన ఎద్దుకు తెగిపడిన విద్యుత్ వైర్లు తగడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ. 50 వేలు ఉందని, నష్ట పరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

నిరుపేదలకు అన్నదానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే ఆర్జీదారుల ఆకలి తీర్చేందుకు వెడ్మ భొజ్జన్న బువ్వ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట అన్నదాన నిర్వహించారు. నాయకులు లాజర్, రాధబాయి, నీలబాయి, అన్నపూర్ణ, దేవానందం, జైవంత్‌రావు, ఇమ్రాన్, అహ్మద్, భీమన్న, మాజీద్, తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగికి సన్మానం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలలో పార్ట్‌టైం వర్కర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన సూరం రాములును ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కల్యాణి, పాఠశాల హెచ్‌ఎం నగేశ్, చైర్మన్ మల్లిఖార్జున్, శంకర్, జ్యోతి పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఎదులాపురం: లభానా మధుర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మధుర లభానా సా సైటీ జిల్లా సలహాదారు సూరజ్‌సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. 2023 ఫిబ్రవరిలో అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికీ ఎస్టీ జాబితాలో చేర్చలేదన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ముఖరా(కె)లో శానిటేషన్

ఇచ్చోడ: ముఖరా(కె) పంచాయతీలో ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గాడ్గే మీనాక్షి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి శానిటేషన్ చేపట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గే సుభాష్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, ఏఎన్ఎం అహల్య పాల్గొన్నారు.

ఎస్పీని కలిసి సీఐ శ్రీనివాస్

ఆదిలాబాద్‌రూరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి శ్రీనివాస్ ఇటీవలే పదోన్నతిపై మహిళా పీఎస్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2012 ఎస్సై బ్యాచ్‌కి చెందిన శ్రీనివాస్ బోయిపల్లి, మధిర రూరల్, వైరా టౌన్, మంచిర్యాల్, నెన్నెల పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వర్తించారు. ఇటీవలే పదోన్నతి పొంది మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి బాధితుల న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్సై అన్వర్ ఉల్ హక్, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బోథ్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బోథ్ సీఐ భీమేష్ అన్నారు. మండలంలోని చింతలబోరి, పార్డి(కె) గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆపద వస్తే 100కు కాల్ చేయాలని సూచించారు. వరదలు వస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది, గ్రామస్తులున్నారు.


కృతజ్ఞత ర్యాలీ

ఇచ్చోడ: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయించినందుకు సోమవారం బీసైన్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. విఠల్‌రెడ్డి గార్డెన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగింది. బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చోడలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా విద్యార్థులకు దూరభారం తగ్గిందన్నారు. నాయకులు సుభాష్‌పటేల్, రాథోడ్ ప్రవీన్, రాథోడ్ ప్రకాశ్, బీసైన్ సభ్యులు పెరమండ్ల స్వామి, జాకీర్, భొజ్జరవి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆచారుల సంఘ భవనం ప్రారంభం

ఎదులాపురం: పట్టణంలోని మోచిగల్లిలో వంట ఆచారుల సంఘ భవనాన్ని ఏర్పాటు చేసుకోగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సభ్యులు హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలు లేనందున స్థల కేటాయింపుకు ఇబ్బంది ఉందన్నారు. తమ వంతు రూ.2 లక్షల సంఘ భవన నిర్మాణానికి అందిస్తామని భరోసా ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు దేవన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్ ప్రకాశ్, జాలిల్ పాషా, ఎస్కే ఫిరోజ్, గంగన్న, లింగన్న, ఇర్ఫాన్‌ఖాన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పీవోకు వినతి



వినతిపత్రం అందిస్తున్న ప్రభాకర్

ఉట్నూర్‌రూరల్: సీసీడీపీ నిధుల కింద రోడ్లు వంతెనలు మంజూరైన ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని ప్రభుత్వం దీనిపై చొరవ చూపాలని రాంజీగోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్ కోరారు. సోమవారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలం వచ్చిందంటే మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లలేని దుస్థితి నెలకొందన్నారు. ఆయన వెంట నాయకులు మంగం విషంరావు, శంకర్, నాగోరావు, రాహుల్, సోము పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అండతోనే హత్యాయత్నం

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బేల: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అండతోనే బీఆర్ఎస్ నాయకులు తన వాహనాన్ని అడ్డుకుని, హత్యాయత్నానికి పాల్పడ్డారని కాంగ్రెస్ జిల్లా నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైకి ఫిర్యాదు చేశారు. స్థానిక శివాజీ చౌరస్తాలో ఎమ్మెల్యే ప్లెక్సీని దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఈనెల 29న రాత్రి మండలంలోని అవాల్‌పూర్ గ్రామానికి వెళ్లగా ఎమ్మెల్యే దగ్గరి బంధువు సోడెం సురేశ్‌తో పాటు మిగతా బీఆర్ఎస్ నాయకులు పదుల సంఖ్యలో వచ్చి రాళ్లదాడి చేసి, హత్యాయత్నానికి ప్రయత్నించారని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో అక్కడ నుంచి బయట పడ్డానన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, సంతోశ్, వాంఖడే వామన్, గుండవార్ సంజయ్, సురేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయండి



మాణిక్‌రావు ఠాక్రేతో గిరిజన నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్ కోరారు. సోమవారం హైదరాబాద్ గాంధీ భవనంలో ఎస్టీసెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జిల్లాకు చెందిన నరేశ్ జాదవ్, కుమ్రం కొటేష్, సెడ్మకి ఆనంద్‌రావ్, వసంత్ జాదవ్ పాల్గొన్నారు. జిల్లాలో ఐటీడీఏ ఉన్నప్పటికీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. గిరిజన యూనివర్సిటీ ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు.

కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జాదవ్ వసంత్‌రావు

నేరడిగొండ: కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నేరడిగొండ మండలానికి చెందిన జాదవ్ వసంత్‌రావు నియమితులయ్యారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌లు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నియామక పత్రం అందజేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తమన్నారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్రం కోటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లు తొలగించిన తరువాతే తీర్మానం



గ్రామసభలో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో బెల్ట్‌షాప్‌లు తొలగించిన తరువాతే ఏజెన్సీలో వైన్స్‌ల నిర్వహణకు తీర్మానం చేయాలని సోమవారం గ్రామస్తులు స్పష్టం చేశారు. వైన్స్‌ల నిర్వహణకు ఇచ్చోడ గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. మండల కేంద్రంలో 60 బెల్ట్‌షాప్‌లు ఉన్నాయని, విచ్చవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడి, బడి అనే తేడా లేకుండా బెల్ట్‌షాప్‌లు నడపడంతో ఆయా కాలనీల్లో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. మూడు రోజుల్లో బెల్ట్‌షాప్‌లను మూసి వేస్తామని ఎక్సైజ్ శాఖ అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఎంపీవో రమేశ్, ఎక్సైజ్ సీఐ చంద్రమౌళి, ఎస్సై రాజేశ్వర్, కొడప జాలైజాకు, కొడప నగేశ్, ఆత్రం మహేందర్, సిడాం మురళి, మెస్రం దేవురావులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తలమడుగు: అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తలమడుగు రైతులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోశ్‌కు వినతిపత్రం అందజేశారు. జూలైలో అధిక వర్షాల వల్ల మండలంలో దాదాపు వేయి ఎకరాలలో పత్తి, సోయా పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు సర్వే చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుల నాగన్న, లచ్చన్న, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

సిరికొండ: పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతుల పక్షాన ఉండి పోరాడుతామన్నారు. బీజేపీ మండలలాధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, ఎంపీపీ పెందుర్ అమృత్ రావు, రఘురాం, అమృత్ పాల్గొన్నారు.

నేరడిగొండ: వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సోమవారం ఆయా గ్రామాల రైతులు తహశీల్దార్ పవన్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ల వారీగా, రైతుల వారీగా సర్వే చేపట్టాలన్నారు. గాజిలి, గాంధారి, కుప్టి, కుమారి, ముల్కల్‌పాడ్, రాయపూర్, తర్నం, మాధాపూర్, వాగ్ధారి, వెంకటాపూర్, కుంటాల గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో కూడా పంటలు దెబ్బతిన్నాయన్నారు. కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, ఓర్సరాజు యాదవ్, రాజేందర్ రెడ్డి, కమల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

‘దోషులను కఠినంగా శిక్షించాలి’

ఎదులాపురం: మణిపూర్‌లో అకృత్యాలు, హత్యలు, అత్యాచారాలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో అన్ని రాజకీయ, సామాజిక, ప్రజా సంఘాల నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కుకీ, నాగా ఆదివాసీలపై మైతీలు 4 నెలల నుంచి దాడులు చేయడం దారుణమన్నారు. సహజ వనరులను కాజేసేందుకే ఆర్‌ఎస్ఎస్, కార్పొరేట్ సంస్థలు కుట్రలో భాగమే ఆదివాసీలపై దాడులు అని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు గంధ్రత్ సుజాత, బీఆర్ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, బీఎస్పీ జిల్లా కన్వీనర్ రమే శ్, ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్, వైఎ స్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు అనిల్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న పాల్గొన్నారు.

పశుపోషణతో అభివృద్ధి



రైతులతో మాట్లాడుతున్న మధుసూదన్

ఇచ్చోడ: పశుపోషణతో రైతులు మరింత అభివృద్ధి చెందాలని ఉమ్మడి జిల్లా డెయిరీ డైరెక్టర్ మధుసూదన్ అన్నారు. సోమవారం మండలంలోని బోరాగామలో రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు. ఎక్కువ పాలు ఇచ్చే గేదేలను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ క్షేత సహాయకుడు నిమ్మల సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.